# ప్రత్యక్ష సాక్షి

తెలుగు దినపత్రిక

RNI No.APTEL/2011/38267



**విలేకరులు కావలెను**

ప్రత్యక్ష సాక్షి దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ ప్రాంతంలోని అన్ని జిల్లాలు మరియు నియోజకవర్గాల నుంచి పనిచేయుటకు విలేకరులు కావలెను. ప్రశ్నించే తత్వంతో పాటు నిజాన్ని నిర్భయంగా రాయగలిగే సత్తా ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి : సెల్ : 99892 88546



సంపుటి : 16 సంచిక : 030 గురువారం 06-08-2026

ఎడిటర్ : కందుకూరి పరమేశ్వర్‌రావు, M.A. పేజీలు : 4 వెల : రూ2/-


## ముప్పై ఏళ్ల దర్గా రోడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం..

### అభివృద్ధి నిరోధకులను ప్రజలు తిరస్కరించాలి...ఎమ్మెల్యే నాయిని..

### ముస్లిం మైనార్టీల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పని చేస్తోంది.. కాజీపేట దర్గా పీఠాధిపతి.. కుసురుపాష





సాయి... ప్రత్యక్ష సాక్షి వరంగల్ బ్యూరో చీఫ్

వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా 48వ డివిజన్ పరిధిలో గత మూడు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న కాజీపేట దర్గా రోడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించి, రూ.50 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం దర్గా ఉత్సవాల సమయంలో తాగునీటి సమస్య తలెత్త కుండా ఉండేందుకు నియోజక వర్గ అభివృద్ధి నిధుల నుంచి రూ.30 లక్షలతో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులకు కూడా శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి .

శంకుస్థాపనల అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాజీపేట దర్గా రోడ్ సమస్య దశాబ్దాలుగా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపారు. బోడగుట్ట, కడిపి కొండ, ఇందిరానగర్ తదితర ప్రాంతాలకు వెళ్లే వేలాది మంది ప్రజలు ఈ రహదారిపై ఆధార పడుతున్నారని, గతంలో ఈ సమస్యపై అనేక ధర్నాలు, ఆందోళనలు, పోలీసు పికెటింగ్ లు జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. దర్గా పెద్దలు, స్థానిక ప్రజాప్రతి నిధులు, అధికారుల సహకారంతో సమస్యకు పరిష్కారం లభించడం సంతోష కరమని అన్నారు. నెల రోజుల్లో రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయా లని అధికారులకు స్పష్టమైన గడువు విధించినట్లు తెలిపారు. అదే విధంగా ఆర్ఈసీ రోడ్ నుంచి బయటకు వెళ్లే ప్రధాన రహదారి అభివృద్ధికి సుమారు రూ.20 కోట్ల ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. ఆ ప్రతిపాదనలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని, ఎంపీ డాక్టర్ కావ్యతో పాటు సంబంధిత మంత్రులతో కూడా ఈ అంశంపై చర్చించినట్లు వెల్లడించారు. నియోజకవర్గంలో ప్రతి గల్లీలో రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక వసతుల కల్పనతో ప్రజా సమస్యలను ఒక్కొక్క టిగా పరిష్కరిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

అయితే అభివృద్ధిని చూసి ఓర్వలేని కొందరు ప్రతిపక్ష నాయకులు అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. తాము తీసుకొచ్చిన అభివృద్ధి పనులపై కూడా నిరాధార ఆరోపణలు చేయడం బాధా కరమన్నారు. దర్గా రోడ్, కాజీపేట బస్టాండ్, రైల్వే ఓవర్ బ్రిడ్జి వంటి దశాబ్దాల సమస్య లను పరిష్కరించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుంటే, కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న పనుల విషయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగదన్నారు. ఇంటి గ్రేటెడ్ స్కూల్, ఇతర అభివృద్ధి ప్రాజెక్టులు, పట్టణ మౌలిక వసతుల అభివృద్ధిని కూడా కొందరు కావాలనే అడ్డుకు న్నారని ఎమ్మెల్యే ఆరోపిం చారు. ప్రజల సంక్షేమం కంటే రాజకీయాలకే ప్రాధాన్యత ఇస్తున్న ఇలాంటి అభివృద్ధి నిరోధకులను ప్రజలు గుర్తించా లని పిలుపునిచ్చారు. వరంగల్ నగరం అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, గత రెండున్నర సంవత్సరాల్లో అనేక కీలక సమస్యలకు పరిష్కారం చూపామని తెలిపారు. ముప్పై సంవత్సరా లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరి స్తున్న ప్రభుత్వం పనితీరును ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. అభివృద్ధిని అడ్డుకునే శక్తులను ప్రజలు తిరస్కరించి, అభివృ ద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం దర్గా పీఠాధిపతి కుసురు పాషా మాట్లాడుతూ ముస్లిం మైనారిటీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని వారికి ఇచ్చిన హామీలు అమలు చేయడంతో పాటు, కాజీపేట దర్గా ఉరుసు ఉత్సవాలకు సంబంధించి పటిష్టమైన ప్రణాళికలతో ముందుకు సాగుతున్నట్లు అని తెలిపారు. రేవంత్ రెడ్డి పాలనలో ముస్లిం మైనార్టీలకు న్యాయం జరుగుతుందని ఆయన తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నేతృత్వంలో కాజీపేట దర్గా ఉత్సవాలు అత్యంత వైభవంగా సకల సౌకర్యాలతో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తని విధంగా అన్ని ఏర్పాట్లను చేస్తూ ముందుకు సాగుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, అబ్బు బక్కర్, మరియు తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ అభివృద్ధి అజెండాతో ఢిల్లీలో కీలక భేటీలు..

### సీఎం రేవంత్ రెడ్డితో కలిసి కేంద్ర మంత్రులను కలిసిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య





సాయి... ప్రత్యక్ష సాక్షి వరంగల్ బ్యూరో చీఫ్

ఢిల్లీ పర్యటనలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులతో భేటీ అయ్యారు. బుధవారం కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ ను కలిసిన సీఎం రేవంత్ రెడ్డి.. అనంతరం కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్ తో సమావేశమయ్యారు.

ముఖ్య మంత్రి వెంట నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ఇతర ఎంపీ లు ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా తెలంగాణకు సంబంధించిన పర్యావరణ అనుమతులు, అటవీ సంరక్షణ, ప్రజా ప్రాధాన్యత కలిగిన అభివృద్ధి ప్రాజెక్టులతో సహా తెలంగాణకు సంబంధించిన కీలక అంశాలకు సంబంధించిన వినతి పత్రం సమర్పించారు. అలాగే తెలంగాణలో పెండింగ్ లో ఉ న్న సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి, తక్షణ నిధుల విడుదల కోసం కేంద్ర మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి వినతి పత్రాలు అందజేశారు. ప్రత్యేకించి, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ఎత్తును 150 మీటర్లకు పెంచేలా మహా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించా లని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

## శ్రీ శివాలయంలో శ్రీ లలితా సహస్రనామ పారాయణ సైత లక్ష కుంకుమార్చన

### పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలు.. చైర్మన్ అల్లంకి సత్యనారాయణ, అర్చకులు వల్లకొండ రమేష్ కు అభినందనలు..







ప్రత్యక్ష సాక్షి , సుల్తానాబాద్

సుల్తానాబాద్ పట్టణంలోని శ్రీ శివాలయంలో శ్రీ లలితా సహస్రనామ పారాయణ సహిత లక్ష కుంకుమార్చన కార్యక్రమం పెద్ద ఎత్తున వైభవంగా జరిగింది, ఈ కార్యక్రమం ఒక సంవత్సరం గా తీసుకొని. నెలలో ఒక మంగళవారంప్రారంభించుకుని నేటికీ ఏడు మాసములు పూర్తి చేయబడినది, ఇందులో పెద్ద ఎత్తున మహిళలు పట్టణ ఆలయ భక్తుబృందం పాల్గొని పారాయణతో పాటు కుంకుమార్చన గావించినారు , ఈ కార్యక్రమం లోక కళ్యాణం కోసం , రాష్ట్రం దేశం సుభిక్షంగాఉండాలని,మంచి వర్షాలు పాడిపంటలు , భక్తులకు ఈతి బాధలు తొలగుడం, కొరకు ఇలాంటి కార్యక్రమం అర్చకులు సంకల్పించి చేపట్టడం జరిగినది, లోక కళ్యాణం కొరకు చేపట్టే ప్రతి కార్యక్రమం ఇందులో పాల్గొన్న ప్రతి మహిళలకు వారి యొక్క ఆరోగ్యం కుటుంబ సౌఖ్యం, కుటుంబ ఎదుగుదల, తద్వారా పట్టణం రాష్ట్రం దేశం సుభిక్షంగా ఉంటుందని ఆలయ అర్చకులు వల్లకొండ మఠం రమేష్ తెలిపినారు.... ఈ పారాయణ సహిత కుంకుమార్చన ఫిబ్రవరితో ముగుస్తుందని తెలిపారు, మహిళలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా ఆలయంలో చైర్మన్ అల్లంకి సత్యనారాయణ , అర్చకులు వల్లకొండ మఠం రమేష్ మరియు పాలకవర్గ సభ్యులు అన్ని సౌకర్యాలు, మహిళలు అందరికీ అల్పాహారం ఏర్పాట్లు చేశారు..

ఇంత మంచి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్న చైర్మన్ అల్లంకి సత్యనారాయణ, అర్చకులు వల్లకొండ మఠం రమేష్ కు, డైరెక్టర్లకు భక్తులు, మహిళలు అభినందిస్తున్నారు, ఇట్టి కార్యక్రమంలో అర్చకులు వల్లకొండ మఠం మహేష్ తో పాటు ధూపం శివప్రసాద్,(జగిత్యాల) పెద్ద ఎత్తున మహిళలు శివాలయం నిత్య భక్త బృందం, సేవకులు,పాల్గొన్నారు.

## పసిపిల్లలకు ముర్రుపాలు తొలి ఆహారం కావాలి : డాక్టర్ అనితా రెడ్డి






ప్రత్యక్ష సాక్షి వరంగల్ ప్రతినిధి

తల్లిపాల వారోత్సవాలలో భాగంగా బుధవారం భీమారం కే.యు దగ్గర లోని అంగనవాడీ సెంటర్ ను అనురాగ్ సొసైటీ చైర్మన్ ,కాకతీయ విశ్వవిద్యా లయం పాలకమండలి సభ్యులు సందర్శించి తల్లిపాల వారోత్సవాలలో ముఖ్య అతిథి గా పాల్గొన్నారు,తల్లిపాల యొక్క ప్రాముఖ్యత, తల్లి పాలుపడుతున్నప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు తల్లులకు, గర్భినీ స్త్రీలకు వివరించారు ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడు తూ ప్రభుత్వం ఆగస్టు 1 నుండి 7 వరకు తల్లిపాల వారోత్సవా లు నిర్వహిస్తారని ,ఇప్పుడి పిల్లలకు సరి అయిన అవగా హన లేక డబ్బాపాలు పడుతు న్నారని, తల్లిపాలు ఎంతో శ్రేష్ఠమైనవని పిల్లలకు రోగ నిరోధక శక్తిని, పోషకాహా రాన్ని అందిస్తాయని ముఖ్యంగా పుట్టిగానే పసుపు రంగులో వచ్చే ముర్రుపాలు అంత్యంత శ్రేష్ఠమైనవని అది చాలామందికి తెలియక ఇవ్వరని తప్పకుండా శిశువుకి అందేలా చూడాలని డాక్టర్ అనితా రెడ్డి అన్నారు ఇదివరకు ఉమ్మడి కుటుం బాలు ఉండి ఇంట్లో పెద్దవారు పిల్లలకు చెప్పేవారని, ఇప్పుడు చిన్న కుటుంబాలలో తెలిసితెలియకబయట జంక్ ఫుడ్ తినడం సరిఅయిన జాగ్రత్తలు తీసుకోకపోవడం తో బరువు తక్కువ పిల్లలు పోషకాహార లోపం తో పుడుతున్నారని, వారికి అంగన్వాడీ టీచర్స్ ఎంతో ఒపికతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి చెబుతున్నారని, గృహ సందర్శన సైతం చేసి సేవలు అందిస్తున్నారని వాటిని వినియోగించుకోవాలని అన్నారు, అనంతరం ఆహారం తినేముందు చేతులు ఎలా శుభ్రం చేసుకోవాలో చూపిం చారు ,బాలింత దగ్గరకు గృహ సందర్శనకి సైతం డాక్టర్ అనితా రెడ్డి వారి ఇంటికి వెళ్లి తీసికోవలసిన జాగ్రత్తలు తెలియచేసారు, అంగనవాడీ పిల్లలు వయస్సుకు తగిన బరువు ఉన్నారా లేదా చూసా రు, ప్రభుత్వం అంగనవాడీ సెంటర్లపై ఎంతో శ్రద్ధ పెడుతు న్నారని పోషకాహార లోపం తో ఏ పిల్లలు ఇబ్బంది పడకూడ దనే లక్ష్యము తో ప్రతి ఒక్కరూ పనిచేయాలని చేయుతనీయా లని డాక్టర్ అనితా రెడ్డి అన్నారు, అంగనవాడీ టీచర్, సిబ్బంది, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

## స్టేషన్ ఘన్‌పూర్ మెగా లెదర్ పార్క్‌కు కేంద్రం వెంటనే ఆమోదించాలి : వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

ప్రత్యక్ష సాక్షి... న్యూఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి



జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌లో ప్రతిపాదించిన మెగా లెదర్ పార్క్‌కు కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆమోదం తెలపాలని వరంగల్ పార్ల మెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కోరారు. బుధ వారం లోక్‌సభలో రూల్-377 కింద ఈ అంశాన్ని ప్రస్తావించిన ఎంపీ, తెలంగాణ ప్రభుత్వం పంపిన ప్రతిపాదన చాలా కాలంగా కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉండడంతో ఉపాధి కల్పనకు దోహదపడే కీలక ప్రాజెక్టు ఆలస్యమవు తోందని పేర్కొన్నారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో ప్రభుత్వ గుర్తించిన 120 ఎకరాల్లో తెలంగాణ స్టేట్ లెదర్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ కార్పొరేషన్ (టీఎస్ఎల్ ఐపీసీఎ) ఆధ్వర్యంలో మెగా లెదర్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించి నట్లు తెలిపారు.

రాష్ట్రంలో లెదర్ పరిశ్రమకు అవసరమైన ముడి పదార్థాల లభ్యతతో పాటు ఎఫ్‌డీడీఐ, నిఫ్ట్, గిల్ట్ వంటి సంస్థల సహకారం కూడా అందు బాటులో ఉందని వివరిం చారు.

ఈ ప్రాజెక్టు అమలైతే ముఖ్యంగా ఎస్సీ వర్గాలకు చెందిన యువతకు పెద్ద ఎత్తున ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు కలుగుతాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినప్పటికీ కేంద్రం నుంచి ఆమోదం రాకపోవడంతో ప్రాజెక్టు ముందుకు సాగడం లేదన్నారు. ఉపాధి కల్పనకు దోహదపడే ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు వెంటనే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి ఆమోద ప్రక్రియను వేగవంతం చేయాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమలు, జౌళి శాఖను వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య కోరారు.

## మాజీ ఎమ్మెల్యే నరేందర్ జన్మదిన వేడుక..

ప్రత్యక్ష సాక్షి రంగసాయిపేట

మాజీ యమ్ఎల్ఎ నన్నపనేని నరేందర్ గారి పుట్టినరోజును పురస్కరించుకొని 42వ డివిజన్ ఇన్చార్జి కొంతం మోహన్ అధ్వర్యంలో శివాశ్రీ హస్పెటల్ డా:చంద్రశేఖర్ అర్యా హస్పెటల్ లో రోగులకు పండ్లు పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో శేర్ల మహేందర్, దేవులపల్లి వేంకటేష్, గంద్రాతి మల్లికార్జున్,పరికిపండ్ల ఈశ్వరయ్య, కోకచలపతి,పూసల కిరణ్,శెంకేశి గణేష్,బక్కి వంశి, బజ్జురివిష్ణు, కూమార్ యాదవ్, కొల వరుణ్,42వడివిజన్ మహిళ అధ్యక్షురాలు అవునూరి లక్ష్మి,చిగిరిపూర్ణ,అరుణ, రాధీక శెంకేశి, కవిత, మునుకుంట్ల రజీని, కవిత,తదితరులు పాల్గొన్నారు.



## మైసమ్మ తల్లికి బోనాలు

ప్రత్యక్ష సాక్షి రంగసాయిపేట



గుండు మైసమ్మ తల్లి భక్తులు కోరుకున్న కోరికలు నెరవేర్చడం వలన అనేకమంది మహిళలు బోనాలు చేసి మైసమ్మ తల్లిని దర్శించుకుంటున్నారని 40 వ డివిజన్ మాజీ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు ఆషాడ మాసం సందర్భంగా ఉర్సు ప్రతాప్ నగర్ లోని ప్రజలు గుండు మైసమ్మ దేవతకు బోనాలు చేసి నైవేద్యం సమర్పించి మేకలను గొర్రెలను కోళ్లను బలి ఇచ్చినారు గుండు మైసమ్మ దేవాలయ ప్రధాన పూజారి శివ సత్తి అయిత హరీష్ తన బృందంతో డోలు చప్పుళ్లతో శివసత్తుల పూనకాలతో వందలాది బోనాలు పురవీధుల గుండా ఊరేగింపుతో దేవాలయంనకు చేరుకున్నారు శివసత్తుల పూనకాలతో దేవాలయ ప్రాంగణం దద్దరిల్లిపోయినది ఇట్టి బోనాల ఊరేగింపులో దేవాలయ కమిటీ అధ్యక్షులు గుడిమెళ్ళ మోహన్ ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల రవి కోశాధికారి గుడిమల్ల వేద ప్రకాష్ కమిటీ సభ్యులు మాటేటి సంపత్ గూడూరు మధుసూదన్ కళ్యాణపు వెంకటేశ్వర్లు కళ్యాణపు యుగంధర్ గుడిమల్ల శ్రీనివాస్ మార్గం లక్ష్మణ్ లు శివసత్తులు భక్తులు పాల్గొన్నారు

# ప్రజల గళంగా మారిన జీవిత సందేశం గద్దర్

## ఆగస్టు 6.. గద్దర్ వర్ధంతి



గళం ఒక శబ్దం మాత్రమే కాదు. అది బాధను పలికించేది, నిరసనకు నినాదం ఇచ్చేది, ఆశయానికి అర్థం చెప్పేది. అలాంటి గొంతు గద్దర్‌ది. విప్లవ గేయాలకు ప్రాణం పోసినవాడు. గోళీల కంటే గొంతు మిన్న అన్న సత్యాన్ని నిరూపించిన. వాడు. విప్లవాన్ని వేదికపైకి తెచ్చిన వాడు. వాణిని ఆయుధంగా మార్చుకున్న వాడు. అలాంటి వ్యక్తిత్వం గద్దర్‌ది. ఆయన కవిత్వం, పాట, ఉద్యమం, జీవితం అన్నీ ఒకే తాడుతో అల్లుకున్నవి. తెలుగు జాతికి ఆయన గొంతు ఒక నడకల పాట. విప్లవ జ్వాలను కమ్ముకున్న కంఠస్వరాన్ని ప్రజలు గద్దర్ రూపంలో చూసారు. ఆయన్ను కేవలం ఓ గాయకుడిగా, ఓ కవిగా చూడటం తక్కువై పోతుంది. ఆయన జీవితం నిండా ప్రజల బతుకుపై ప్రేమ, శోషితుల పట్ల బాధ్యత, సమానత్వ పట్ల ఆశయ నిబద్ధత నిండి పోయినది. గద్దర్ అసలు పేరు గుమ్మడి విఠల్ రావు. 1949 ఆగస్టు 17న హైదరాబాద్ సమీపంలోని మేడిపల్లిలో కార్మిక కుటుంబంలో జన్మించారు. తండ్రి వెంకటయ్య డాల్మిల్ కార్మికుడు, తల్లి శారదమ్మ నిరక్షరాసురాలు. బాల్యంలోనే అణచివేత, అసమానతలు, అత్యాచారాలను ప్రత్యక్షంగా చూశారు. ఈ అనుభవాలే ఆయనను సామాజిక చైతన్యపు మార్గంలో నడిపించాయి. తార్నాక ఐటీఐలో డిప్లొమా చేసిన తరువాత హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ లో కొంతకాలం ఉద్యోగం చేశారు. కానీ పేదల బతుకులపై నడిచే మార్గం వైపు ఆయనకు చిరునవ్వులు ఎక్కువ, చీకట్లపై ప్రశ్నలు ఎక్కువ.

1970లలో వామపక్ష భావజాలం ప్రభావితుడై, నక్సల్బరీ ఉద్యమానుసంధానంగా వెలసిన తెలంగాణ జ్ఞానవేదిక, ప్రజా నాటక ఉద్యమాల్లో ఆయన పాలుపంచు. కున్నారు. అనంతరం 'జననాట్య మండలి'లో చేరి ప్రజలలో చైతన్యం నింపే కళా కారుడిగా, ఉద్యమ స్ఫూర్తిని రగిలించే గాయకుడిగా మారారు. అదే సమయంలో "గద్దర్" అనే పేరిట పిలువ బడుతూ ప్రజల గుండెల్లో నిలిచారు. 'గద్దర్' అనే పేరు ఒక బంగ్లాదేశ్ యువ యోధుని జ్ఞాపకార్థంగా స్వీకరించారు. ఈ పేరు తరువాత ఆయన గళానికి, ఆయన పాటలకు, ఆయన పోరాట జీవనానికి ప్రతీకగా మారింది. ఆయన పాడిన పాటలు ప్రాచుర్యంలోకి రావడం కాదు --- ప్రజల్లో ఉద్యమాత్మక చైతన్యాన్ని నింపడం ముఖ్యమైనది. "బండెనక బండి కట్టి", "పొద్దంతా పాడుతా నీ పేరంటో చెప్పు బాబోయ్", "ఇక్కడ ఖైదీ గదిలా ఊరు", వంటి గీతాలు సామాన్య ప్రజానీకంలో ఉద్యమాత్మక స్ఫూర్తిని నింపినవి. ఆయన గళం వినిపించిన చోట ప్రజలు గుమి కూడారు. ఆయన వేదిక ఎక్కితే ఆ వేదిక ఉద్యమ రంగ స్థలంగా మారేది.

గద్దర్ జీవితంలో 1997 సంవత్సరం ఒక మైలురాయి. ఆ సంవత్సరం ఆయనపై నక్కి వేసిన గుళ్ల దాడిలో గుండెలోకి మూడు బుల్లెట్లు దూసుకొచ్చాయి. ఒకటి ఆయన శరీరంలో జీవితాంతం మిగిలి పోయింది. హింసను ఎదిరించిన ఆ గళాన్ని బుల్లెట్లు ఆపలేక పోయాయి. ఆ గాయంతో పాటే ప్రజల గుండెల్లో ఆయనకి స్థానం ఏర్పడింది. తన ప్రాణాల మీద జరిగిన దాడిని కూడా ప్రజల పక్షాన ఓ రాజకీయ ప్రకటనగా మలిచిన వాడు ఆయన. "గుండెపై బుల్లెట్లు పడ్డా, గళం ఆగదు" అని స్పష్టంగా ప్రకటించిన ధీశాలి ఆయన.

తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున లేచి వచ్చినప్పుడు, ఆ ఉద్యమానికి శక్తి నిచ్చిన శబ్దం గద్దర్ గళమే. విభజన అనివార్యమని ప్రకటించి, ప్రాంతీయతను కాదు -- ప్రజల ప్రయోజనాలను ప్రాతినిధ్యం వహించిన వ్యక్తి ఆయన. ఆయన పాటలు తెలంగాణ ఆకాంక్షకు ప్రాణం పోసినవే. ఉద్యమ కాలంలో జరిగిన అసంఖ్యాక సమావేశాల్లో, సదస్సుల్లో, ఊరేగింపుల్లో గద్దర్ పాటలు బలంగా ప్రతిధ్వనించాయి. ప్రత్యేక రాష్ట్ర ఆవశ్యకతను ఒక ఉద్యమ గీతంలా మార్చిన ఘనత ఆయనదే. 1998 లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన, తనను "జనజ్ఞాన వేదిక" అభ్యర్థిగా ప్రకటించుకున్నారు. అది పార్టీ కోసం కాదు --- ప్రజల ఆకాంక్షల్ని వేదికలపై నుంచి, సభల్లో నుంచి రాజ్యాంగ నిబంధనల వెలుగులోకి తీసుకురావాలన్న ప్రయత్నం. రాజకీయాల్లోకి అడుగుపెట్టినా ఆయన గళం మారలేదు. ఆయన ధోరణిలో మార్పు రాలేదు. ప్రజల పట్ల ఉన్న బాధ్యతకు రూపం చెరగ లేదు. గద్దర్ చివరికి మారినది మార్గమే అయినా, లక్ష్యానికి దూరంగా పయనించ లేదు. హింస, గుంపుల రాజకీయం, ఆయుధ మార్గం పట్ల విముఖత ప్రకటించారు. ప్రజాస్వామిక విలువలతో, మానవీయ నడకలతో కూడిన మార్గాన్నే ఆశ్రయించారు. ఈ దిశగా తన కుమారుడి వివాహాన్ని మతపరమైన సంప్రదాయాల నుంచి బయటికి తీసుకొచ్చి, ఒక ఉదారతకు నిదర్శనంగా మలిచారు.

ఆయన అనారోగ్యంతో బాధపడుతూ 2023 ఆగస్టు 6న హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. ఆయన మరణంతో తెలుగు నేల ఒక గొప్ప గొంతును కోల్పోయింది. ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం పొందిన ఒక యుగపురుషుడిని కోల్పోయింది. అయితే గద్దర్ జీవితం మౌనంగా ముగియలేదు. ఆయన పాటలు ఈ నేలపై ప్రతిధ్వనిస్తూనే ఉంటాయి. వృద్ధుల ఆశల లోనూ, యువత శ్వాసల లోనూ, అణగారిన వర్గాల ఆశయాల లోనూ, ఆయన గొంతు పదే పదే వినిపిస్తూనే ఉంటుంది. గద్దర్ అనగానే గుర్తుకొచ్చేది పాట కాదు, పోరాటం. గళం కాదు, గుండె ధైర్యం. వేదిక కాదు, విప్లవం. ఆయన జీవితం ఒక యాత్ర కాదు --- ఒక యుగం.

ఆయన లేరు గాని, ఆయన గళం సజీవంగా ఉంది.

ఆయన పాట ఒక కాలపు శబ్దమాత్రం కాదు --- ప్రజల కోసం ఆ శబ్దం శాశ్వతమైంది. జయహో గద్దర్!

నీ గళం లేకపోయినా -- నీ గాథ ప్రజల గుండెల్లో ఉండిపోతుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్, 9440595494

# కార్మికుల సమస్యల కోసం ఏఐటీయూసీ సమరశీల పోరాటాలు..

## ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజు







సాయి... ప్రత్యక్ష సాక్షి వరంగల్ బ్యూరో చీఫ్

కార్మికుల హక్కుల కోసం ఏఐటీయూసీ నిరంతరం రాజిలేని సమరశీల పోరాటాలు నిర్వహిస్తుందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజు అన్నారు. బుధ వారం హన్మకొండలోని ప్రెస్ క్లబ్ లో హనుమకొండ ఏఐటీయూసీ రెండవ మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మహాస భలకు ముఖ్య అతిథిగా హాజరైనా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధా న కార్యదర్శి ఎస్. బాలరాజు జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం జరిగిన మహాసభ కు వేల్పుల సారంగపాణి, నేదనూరి రాజమౌళి లు అధ్యక్షవర్గంగా వ్యవహరించగా ఎస్. బాలరాజు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం దేశంలో ఏర్పడిన మొట్ట మొదటి సంఘం ఏఐటియుసి అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అలంబిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాల్ని తిప్పి కొట్టేందుకు కార్మిక లోకం పోరాటాన్ని తీవ్రతరం చేయాల ని పిలుపునిచ్చారు. పెట్రోల్, వంట గ్యాస్, డీజిల్ ధరలను పెంచి ప్రజలపై మోయలేని భారం వేశారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ అవలంబిస్తున్న ఆర్థిక విధానాల వల్ల ధనవంతులు చట్టం, మరింత ధనవంతులు గా పేదవారు మరింత పేదవా రిగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక లోకం కన్నెర్ర చేస్తే ప్రభుత్వాలు కూలి పోతాయని అన్నారు. భారత దేశంలో 1920 అక్టోబర్ 31 ఆవిర్భవించిన మొట్ట మొదటి కార్మిక సంఘం ఏఐటీయూసీ అని అన్నారు. స్వాతంత్రానికి పూర్వమే కార్మిక చట్టం, ఫ్యాక్టరీల చట్టం, పారిశ్రామిక వివాధాల చట్టం, కనీస వేతన సాధించుకోవడం జరిగిందని అన్నారు.

బ్రిటిష్ సామ్రాజ్య వాదుల నుండి భారతదేశాన్ని విముక్తి చేయుటకు జరిగిన స్వాతంత్ర సంగ్రామంలో కార్మిక వర్గాన్ని సంఘటితం చేసి సామ్రాజ్య వాదానికి వ్యతిరేకం గా స్వతంత్ర సాధనే ధ్యేయంగా విరోచిత పోరాటాలు చేసిన గొప్ప కార్మిక సంఘం ఏఐటీ యూసీ అన్నారు. సామ్రాజ్య వాద పెట్టుబడిదారుల చేతుల్లో నలిగిపోయిన కార్మిక వర్గానికి దిక్సూచిగా నిలిచిన అనేక ఉద్యమాల ద్వారా కార్మిక చట్టాలను హక్కులను సాధించిన ఏకైక సంఘం ఏఐటీయూసీ పోరాడి సాధించు కున్న కార్మిక చట్టాన్ని నరేంద్ర మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చి కార్మికుల్ని బానిసలుగా మారుస్తుందని ఆరోపించారు. పని గంటల పెంచి కార్మికుల శ్రమ దోపిడికి పాల్పడే విధంగా పెట్టుబడిదారులకు అనుకూ లంగా కేంద్ర ప్రభుత్వం చట్టాలు మారుస్తుందని ఆరోపించారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాల అవుతున్న నేటికీ రాష్ట్రంలో కాంటాక్ట్, ఔట్సోర్సిం గ్ ఉద్యోగుల జీవితాలు మార లేదని, కనీస వేతనం ఎన్ హెచ్ ఎం ఉద్యోగులకు రూ.32000 వేల వేతనం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీ.ఎఫ్, ఈ.ఎస్.ఐ అమలు నోచుకోక శ్రమదోపిడికి గురవుతున్నారు. అదేవిదంగా సిపిఐ జిల్లా కార్య దర్శి కర్రె బిక్షపతి మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అను గుణంగా వేతనాలు పెంచడం లో ప్రభుత్వం విఫలమైందనీ అన్నారు.

కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతి రేక విధానాల పై పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. ఉపా ధి హామీ పథకం నీరుగార్చే విధంగా కేంద్ర ప్రభుత్వం కుట్ర లు చేసిందని ఆరోపించారు. ఈ మహాసభలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శిలు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజు గౌడ్, ఏఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్మల రామ్మూర్తి, సహాయ కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా,ఆటో యూనియ న్ నాయకులు దుర్గాప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కర్రె లక్ష్మణ్, సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్, ఇల్లందుల రాములు,గడ్డం లక్ష్మి, కే.మల్ల య్య, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ నూర సంపత్ పటేల్, రసమల్ల దీనా, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధ ప్రాతిపదికన పైపులైన్ పనులు పూర్తి

## మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ

ప్రత్యక్ష సాక్షి , సుల్తానాబాద్

సుల్తానాబాద్ పట్టణములో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నందున మరియు నూతన అమృత్ పైప్ లైన్ వేసే క్రమంలో గట్టేపల్లి పైప్ లైన్ పగిలి నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడగా బుధవారం మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ , కమిషనర్ రమేష్ లు పర్యవేక్షించి పైప్ లైన్ లీకేజీ పనులు మున్సిపల్ సిబ్బందిచే యుద్ధప్రాతిపదికన పూర్తి చేశారు, గురువారం నుండి యధావిధిగా మంచినీటి సరఫరా పట్టణంలో చేయడం జరుగుతుందని, అదేవిధంగా నేడు శివాలయం వద్ద రోడ్డుపై ప్రజలకు వాహనముల నుండి ఇబ్బందులు లేకుండా ఉండుటకై ప్రభుత్వ విప్ , ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఆదేశాల మేరకు చైర్పర్సన్ బిరుదు రాధాకృష్ణ పర్యవేక్షణలో రోడ్డు ప్రమాదాలు నివారించుటకై ప్లాస్టిక్ స్పీడ్ బ్రేకర్లు బిగించనైనది. ఈ కార్యక్రమంలో వైస్ చైర్పర్సన్ అంతటి పుష్పలత , వార్డు కౌన్సిలర్లు గాజుల రాయమల్లయ్య , ఊట్ల వర ప్రదీప్, సిద్ధ తిరుపతి , తొర్రికొండ ప్రభాకర్ పాల్గొన్నారు.



# గాలివాన బీభత్సం....రైస్ మిల్ కాంపౌండ్ గోడ కూలి భారీ నష్టం..

## ప్రభుత్వం ఆదుకోవాలని యజమాని పన్నాల రాములు విజ్ఞప్తి..

ప్రత్యక్ష సాక్షి , సుల్తానాబాద్

సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలో సుగులాంపల్లి గ్రామంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది.. సుగులాంపల్లి గ్రామంలో గల రాధాకృష్ణ రైస్ మిల్ కు భారీ నష్టం వాటిల్లింది, ఈ భారీ బీభత్సంకు మంగళవారం తెల్లవారుజామున ఉనుక రూమ్ వద్ద కాంపౌండ్ గోడ కూలిపోవడంతో పాటు కొన్ని విలువైన వస్తువులు ధ్వంసం అయ్యాయని, మొత్తం 8 లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లిందని ఆ రైస్ మిల్ యజమాని పన్నాల రాములు తెలిపారు, ప్రకృతి విపత్తుతో తీవ్రంగా నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకొని తగిన నష్టపరిహారం మంజూరు చేయాలని రైస్ మిల్ యజమాని పన్నాల రాములు విజ్ఞప్తి చేశారు...



# ఉపాధ్యాయులు విద్యార్థులకు

# సైబర్ నేరాలపై అవగాహన పెంచాలి : సీపీ ఎన్.శ్వేత






సాయి... ప్రత్యక్ష సాక్షి వరంగల్ బ్యూరో చీఫ్

రాబోవు రోజుల్లో సైబర్ నేర గాళ్ల చేతుల్లో మోసపోకుండా వుండాలంటే సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై వుందని వరంగల్ పోలీస్ కమిసషర్ ఎన్.శ్వేత,ఐపిఎస్ సూచిం చారు.సురక్షా కా తిరంగా కార్యక్రమములో భాగంగా సెంట్రల్ పోలీసుల అధ్వర్యంలో బాల సముద్రం లోని కాళోజీ కళా క్షేత్రంలో సైబర్ నేరాలపై ప్రభుత్వ పాఠాశాల ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్ర మాన్ని నిర్వహించారు. వరం గల్ పోలీస్ కమిషనర్ ముఖ్య అతిధిగా పాల్గోన్న ఈ కార్యక్ర మములో సైబర్ విభాగం అధికారులు ముందుగా సైబర్ నేరగాళ్ళు నేరాలు పాల్పడే తీరుతో ఏవిధంగా అప్రమ త్తంగా వుండాలని వివరించడం తో పాటు పోలీస్ జాగృతి కళాబృందం సభ్యులు సంస్కృ తి కార్యక్రమాల ద్వారా సైబర్ నేరాలపై అవగాహన కల్పించా రు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఎన్నో సైబర్ నేరగా ళ్ళు నేరాలకు పాల్పడుతూ ప్రజల సొమ్మును దొచుకుంటు న్నారు. ఇలాంటి సంఘటలు వింటున్న, ప్రజల్లో సైబర్ నేరాల పట్ల అవగాహన వున్న కూడా ప్రజలు సైబర్ నేరగాళ్ళ చేతు ల్లో మోసాలకు గురౌవుతున్నా రు.

ఇందుకు ప్రధాన కారణంలో ప్రజల్లో వున్న అత్యాశ కారణం తో పాటు,భయం,అత్యవసరం లాంటి కారణాల కారణంగా సైబర్ మోసాల బారీన పడుతు న్నామని,సెల్‌ఫోన్ వినియోగం ద్వారా కొద్ది మనలో ప్రశాంత తగ్గిందని. ముఖ్యంగా సెల్ ఫోన్ల వినియోగం సమయంలో అప్రమత్తంగా వుండాలని, గుర్తు తెలియని వ్యక్తుల నుండి వచ్చే మెసేజ్‌లు, ఫోటోలపై క్లిక్ చేయడం చాలా ప్రమాదమని, తమ సెల్‌ఫోన్ ఏ వ్యక్తుల అధీనంలోకి వెళ్తుతుందో తెలియదని. ప్రతి సెల్‌ఫోన్ వినియోగదారుడు తప్పని సరిగా ప్రవైయిట్ సెట్టింగ్‌ల్లో మార్పు చేసుకోవడం శ్రేయస్సు కరమని. అలాగే పిల్లలకు ప్రవైయిట్ లైఫ్, పబ్లిక్ లైఫ్‌ల పట్ల అవగాహన కల్పించాలని, ముఖ్యంగా ఎంతో మంది తమ వ్యక్తిగత జీవితానికి సంబం ధించి ఫోటోలను సమాచారాన్ని సోషల్ మీడియాల ద్వారా పంచుకోవడంతో ఎన్నో అనర్థాలు జరుగుతున్నాయని. ఆన్‌లైన్ ద్వారా చేసే కొనుగోలు సమయంలో ప్రతి ఒక్కర అప్రమత్తతో పాటు, అవగాహ న కలిగి వుండాలని పోలీస్ కమిషనర్ తెలియజేసారు.

అనంతరం ఉపాధ్యాయుల చేత పోలీస్ అధికారులు సైబర్ నేరాలపై పట్ల అప్రమత్తంగా వుంటామంటూ ప్రతిజ్ఞ చేయించడంతో పాటు, సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ రూపోందించిన పోస్టర్లను పోలీస్ కమిషనర్ అవిష్కరిం చారు.ఈ కార్యక్రమములో సెంట్రల్ జోన్ డిసిపి దారా కవిత, విద్యాశాఖ సి.యం.ఓ సుమ, హన్మకొండ, సైబర్ క్రైమ్, ఎస్.బి ఎసిపిలు నర్సింహ రావు, వెంకటరమణ, జాన్ నర్సింహులు, ఇన్స్‌స్పెక్టర్లు రజింత్, శివకుమార్, రవికుమా ర్,అశోక్, ప్రవీణ్ కుమార్‌తో పాటు ఇతర పోలీస్ అధికా రులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఇండ్ల స్థలాలు స్థానికులకే ఇవ్వాలని వినతి..



గూడ రమేష్, ప్రత్యక్ష సాక్షి, ఇబ్రహీంపట్నం

జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్ర శివారులో గల ధర్మసాగర్ కాలనీలో ఇండ్ల స్థలాలను స్థానికులకే ఇవ్వాలని కోరుతూ బుధవారం పలువురు గ్రామస్థులు తహశీల్దార్ వరప్రసాద్ కు వినతి పత్రం అందజేశారు. ధర్మసాగర్ కాలనీలోని ప్రభుత్వ భూమిలో ఇండ్ల స్థలాలను స్థానికేతరులకు కాకుండా స్థానికులకు మాత్రమే కేటాయించాలని వినతి పత్రంలో కోరారు. గ్రామంలో ఎక్కువ మంది సొంత స్థలం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కావున అర్హులైన స్థానికులకే ఇండ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కంతి రమేశ్, బైండ్ల శ్రీకాంత్, అజారుద్దీన్, దినేశ్, ప్రవీణ్, తిరుపతి, మారుతి తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నాయకులు చిల్లర రాజకీయాలు మానుకోవాలి


డి ఆర్ స్వామి ప్రత్యక్ష సాక్షి రామకృష్ణాపూర్

క్యాతనపల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలోబుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ పైడిమల్ల నర్సింగ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ నాయకుడు రాజా రమేష్ చిల్లర రాజకీయాలు మానుకోవాలని అన్నారు కార్మిక, గనుల శాఖ మంత్రి, వివేక్ వెంకటస్వామి పై, క్యాతనపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులపై, మున్సిపల్ కమిషనర్ పై చేసిన అనుచిత, వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రజా సమస్యలపై మాట్లాడాల్సిన ప్రతిపక్ష నాయకులు వ్యక్తిగత విమర్శలు, చౌకబారు ఆరోపణలు చేయడం వారి రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని విమర్శించారు.

ప్రజల ఆదరణ పూర్తిగా కోల్పోయిన కొందరు నాయకులు తమ ఉనికిని చాటుకోవడానికి ఇలాంటి చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని మున్సిపల్ కమిషనర్ ప్రభుత్వ అధికారులను బెదిరించడం, అవమానించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు విరుద్ధమని పేర్కొన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే సంస్కృతిని కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్ పర్సన్ జంగం కళ, ఎస్సీ సెల్ నాయకులు దాముక రమేష్ మాజీ ఎంపీటీసీ పుల్లూరి కళ్యాణ్, ప్రధాన కార్యదర్శి నక్క శ్రీనివాస్, కార్యదర్శి సాయి కృష్ణ, నాయకులు నేరెళ్ల చంద్రయ్య, యువజన నాయకులు రాజ్ కుమార్, రంజిత్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎస్సీ సెల్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# తీపి రుగ్మతను.. తిప్పి కొడదాం



డయాబెటిస్.. దాదాపు ప్రతి ఇంట్లో వినిపించే జీవనశైలి ప్రధానమైన జబ్బు. ఇది ఒక్కసారి వస్తే జీవితాంతం వదలదు. బతికినంత కాలం మందులు వాడాల్సిందే. అయితే, ఇది నిన్నటి మాట. వచ్చిన రోగాన్ని తిరిగి వెనక్కి పంపించవచ్చునేది నేటి భరోసా! అవును ఇది అక్షరాల నిజమే. డయాబెటిస్‌ను నియంత్రించడమే కాకుండా వ్యాధిని వెనక్కి తిప్పి కొట్టవచ్చంటున్నారు వైద్యరంగ నిపుణులు. దీనికి కొన్ని నియమ నిబంధనలు, వయసు పరిమితి, వ్యాధి వచ్చిన కాలపరిమితి లాంటివి కీలకం అని చెబుతున్నారు. ఒక్కసారి షుగర్ వ్యాధి వచ్చిన తర్వాత రివర్సల్ డయాబెటిస్ ఎలా సాధ్యం, అందుకు పాటించాల్సిన ఆరోగ్య నియమాలు, తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలను నేటి ఊపిరిలో తెలుసుకుందాం.

డయాబెటిస్ అంటే రక్తంలో చక్కెర (బ్లడ్ గ్లూకోజ్) స్థాయిలు పెరగడం. 80వ దశకానికి ముందు డయాబెటిస్ అనే సమస్య ఒకటి ఉందనే విషయం చాలామందికి తెలియదు. కాలక్రమేణా ఈ సమస్య 60 ఏండ్లు పైబడిన వారికి, బాగా డబ్బున్నవాళ్లలో మాత్రమే ఎక్కువగా కనిపించేది. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, ఉరుకులు పరుగుల ఉద్యోగాలు తదితర కారణాలతో ప్రస్తుతం ఈ వ్యాధి వయసు, ఆర్థిక స్థాయి, లింగ భేదంతో సంబంధం లేకుండా అందరిలోనూ వస్తున్నది. పిల్లల్లో జువైనల్ డయాబెటిస్‌గా లేదా టైప్-1 డయాబెటిస్‌గాను, పెద్దల్లో ఎక్కువ శాతం టైప్-2 డయాబెటిస్ రూపంలో దాడి చేస్తుంది. శాస్త్రీయంగా చూస్తే డయాబెటిస్ రావడానికి ప్రధాన కారణం క్లోమగ్రంథిలోని బీటా కణాలు అవసరమైనంత మోతాదులో ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేయలేకపోవడం. లేదా ఉత్పత్తి అయిన ఇన్సులిన్ సరిగా పనిచేయకపోవడం. వ్యాధి నిరోధక వ్యవస్థకు సంబంధించిన కారణం వల్ల చిన్నారుల్లో కూడా ఈ సమస్య వచ్చే అవకాశం ఉంటుంది. బీటా కణాలు పనిచేయకపోవడం పిల్లల్లో అసలు ఇన్సులిన్ తయారు కాదు. అందు వల్ల వీళ్లకు తప్పనిసరిగా ఇన్సులిన్ ఇంజెక్షన్లు అవసరం అవుతాయి. పెద్దవారిలో సర్వసాధారణంగా కనిపించేది రెండో రకం డయాబెటిస్.



90 శాతం మంది మధుమేహులు టైప్-2 ఉన్నవారే. జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవడం వల్ల దీన్ని నియంత్రించవచ్చు. స్థూలకాయం ఉన్న కొందరు మహిళల్లో గర్భిణిగా ఉన్నప్పుడు కనిపించేది జెస్టేషనల్ డయాబెటిస్. ఇది తాత్కాలికమే అయినప్పటికీ దీర్ఘకాలంలో టైప్ 2 డయాబెటిస్ వచ్చే అవకాశం ఎక్కువ.

ఎలా వెనక్కి పంపవచ్చు?: టైప్-2 డయాబెటిస్ ఉన్న రోగుల్లో మాత్రమే రివర్సల్ డయాబెటిస్ సాధ్యపడుతుంది. అంటే వ్యాధిని వెనక్కి పంపవచ్చు. టైప్-1 వారిలో రివర్సల్ డయాబెటిస్ సాధ్యపడదు.

ఎప్పుడు సాధ్యం?: షుగర్ వ్యాధి వచ్చిన రెండు సంవత్సరాల్లోపు, లేదా ప్రీ డయాబెటిస్ దశలో రివర్సల్ డయాబెటిస్ సాధ్యమవుతుంది. అంటే వచ్చిన రోగాన్ని వెనక్కి పంపవచ్చు. ఈ రివర్సల్ డయాబెటిస్ అనేది గతంలో కూడా ఉన్నది. కాకపోతే అప్పుడు అందుబాటులో ఉన్న మందులతో అది పెద్దగా సాధ్యపడలేదు. ప్రాచుర్యంలోకి కూడా రాలేదు. గత నాలుగైదు సంవత్సరాలుగా ఈ రివర్సల్ డయాబెటిస్‌పై దృష్టి పెట్టారు. వైద్యరంగంలో వస్తున్న మార్పుల్లో భాగంగా ప్రస్తుతం ఊబకాయం కోసం కొత్త కొత్త మందులు అందుబాటులోకి వస్తున్నాయి. వీటి సాయంతో రివర్సల్ డయాబెటిస్ మంచి ఫలితాలు ఇస్తున్నది. జీవనశైలిలో మార్పులతోపాటు కొన్ని రకాల మందులతో రివర్సల్ డయాబెటిస్ సాధ్యపడుతుంది.

సాధారణ చక్కెర స్థాయులు: పరగడుపున (అల్పహారానికి ముందు) ఫాస్టింగ్ బ్లడ్ షుగర్ స్థాయులు 100 ఎంజీ/డీఎల్ కంటే తక్కువగా ఉండాలి. భోజనం చేసిన రెండు గంటల్లోపు పోస్ట్ ప్రాండియల్ బ్లడ్ గ్లూకోజ్ స్థాయులు 140ఎంజీ/డీఎల్‌గా ఉండాలి.

చికిత్సా పద్ధతి: షుగర్ వ్యాధి వచ్చి, మందులు వాడుతున్న వారికి లేదా ప్రీ-డయాబెటిస్ రోగులకు రివర్సల్ డయాబెటిస్ చికిత్స అందించవచ్చు. అయితే ఇది అందరికీ సాధ్యపడదు. వ్యాధి వచ్చిన రెండేండ్ల లోపు వారిలో మాత్రమే మంచి ఫలితాలు కనిపిస్తాయి. ఇక చికిత్స విధానంలోకి వెళ్తే షుగర్ వ్యాధిగ్రస్తులు డయాబెటిస్ మందులు వాడుతూనే వైద్యుల సూచన మేరకు ఆహారపు అలవాట్లు, జీవనశైలి మార్పులు కూడా చేసుకోవాలి. అంతేకాకుండా వ్యాయామం తప్పనిసరిగా చేయాలి. దీనివల్ల నెమ్మదిగా షుగర్ అదుపులోకి వస్తుంది. మొదటి నెలలోనే ఫలితాలు కనిపించడం మొదలవుతుంది. వీరికి మొదటి మూడు నెలల వరకు ప్రతినెలా షుగర్ పరీక్షలు చేస్తూ పర్యవేక్షించాలి. ఆ తర్వాత ప్రతి 3 నెలలకు ఒకసారి షుగర్ టెస్టు చేయాల్సి ఉంటుంది. అయితే వ్యాధి నియంత్రణలోకి వచ్చిన తర్వాత క్రమంగా మందుల మోతాదును తగ్గిస్తూ పోతారు. ఫాస్టింగ్ (పరగడుపున) బ్లడ్ గ్లూకోజ్ స్థాయులు 100ఎంజీ/డీఎల్ కంటే తక్కువగా, పోస్ట్ ప్రాండియల్ (తిన్న రెండు గంటల తర్వాత) బ్లడ్ గ్లూకోజ్ స్థాయులు 140ఎంజీ/డీఎల్, హెచ్‌బీఏ-1సి శాతం 5.7కంటే తక్కువగా వచ్చిన తర్వాత డయాబెటిస్ మందులను పూర్తిగా నిలిపివేస్తారు.

మూడు నెలల తర్వాత..: డయాబెటిస్ మందులు మానేసిన 3 నెలల తర్వాత కూడా ఫాస్టింగ్ బ్లడ్ షుగర్ స్థాయులు 100ఎంజీ/డీఎల్ కంటే తక్కువగా, పోస్ట్ ప్రాండియల్ బ్లడ్ గ్లూకోజ్ 140ఎంజీ/డీఎల్‌గాను, హెచ్‌బీఏ 1సి 5.7 శాతం కంటే తక్కువగా ఉంటే అప్పుడు రోగిని రివర్సల్ డయాబెటిస్ కింద పరిగణిస్తారు. అంటే షుగర్ వ్యాధి తగ్గినట్టుగా భావించవచ్చు. ప్రస్తుతం 10 మంది డయాబెటిస్ రోగులకు రివర్సల్ చికిత్స అందిస్తే అందులో ఆరుగురిలో వ్యాధి నియంత్రణలోకి రాగా ఇద్దరిలో రివర్సల్ డయాబెటిస్ ఫలితాలు వస్తున్నాయి. డైట్, బరువు, ఆహారపు అలవాట్లు మార్చుకుని, క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే రివర్సల్ డయాబెటిస్ సాధ్యమే! అంటే తాత్కాలికంగా షుగర్ తగ్గవచ్చు. ఈ సమయంలో షుగర్‌ను క్రమం తప్పకుండా పరీక్షించుకోవాలి. అయితే, మందులు వాడాల్సిన అవసరం లేదు. పాంక్రియా (క్లోమగ్రంథి) సామర్థ్యం అధికంగా ఉండటం వల్ల షుగర్ స్థాయులు తగ్గే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

రీ-రివర్స్ డయాబెటిస్: ఒక్కసారి వచ్చి, తగ్గిపోయిన తర్వాత మళ్లీ వచ్చే డయాబెటిస్‌ను రీ-రివర్స్ డయాబెటిస్ అంటారు. జీవనశైలి, ఆహారపు అలవాట్లు సరిగ్గా పాటించకపోతే అప్పుడు మళ్లీ డయాబెటిస్ వచ్చే అవకాశం ఉంటుంది. అయితే రివర్సల్ డయాబెటిస్ ఫలించిన కొందరు రోగుల్లో ఆరు నెలలకే మళ్లీ రీ-రివర్స్ డయాబెటిస్ రావచ్చు. ఆరోగ్య నియమాలు తు.చ. తప్పకుండా పాటించే వారిలో కొన్ని సంవత్సరాల వరకు కూడా మళ్లీ డయాబెటిస్ రాకపోవచ్చు.

పాటించాల్సిన ఆహార నియమాలు: బాగా మరపట్టిన బియ్యంతో చేసిన అన్నం తినకూడదు. బ్రేక్‌ఫాస్ట్‌లో ఇడ్లీ, దోశ వంటి తెల్లటి పిండి పదార్థాలతో తయారుచేసిన వంటకాలకు దూరంగా ఉండాలి. ఆలు, బీట్‌రూట్, క్యారెట్లు కూడా తీసుకోకూడదు. బేకరీ పదార్థాలను అసలే తినకూడదు. కాఫీ, టీలో చక్కెరను పూర్తిగా తగ్గించాలి. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి. కుటుంబ నేపథ్యం ఉన్నవారు..

కుటుంబ నేపథ్యంలో డయాబెటిస్ బాధితులు ఉన్నవారు పై నియమాలు కచ్చితంగా పాటించాలి. ప్రతిరోజూ కనీసం 20 నిమిషాలు లేదా వారంలో 150 నిమిషాలు వాకింగ్ లేదా రన్నింగ్ వంటివి చేయాలి. తల్లిదండ్రులకు షుగర్ ఉంటే వారి పిల్లలు తమ బరువును అదుపులో ఉంచుకోవాలి. ముఖ్యంగా డైట్‌ను కంట్రోల్ చేస్తే షుగర్ వ్యాధి రాకుండా నివారించుకోవచ్చు.

బరువు తగ్గడానికి..: జీఎల్‌పి-1 ఎనలాక్ మందులు సిమాగ్లోగ్లుటైడ్, నీరాగ్లుటైడ్ తదితర మాలిక్యూల్స్ అందుబాటులో ఉన్నాయి. వీటివల్ల షుగర్ నియంత్రణలోకి వచ్చి ఆహారం తీసుకోవడం తగ్గుతుంది. దీంతో బరువు తగ్గడమే కాకుండా షుగర్ కూడా నియంత్రణలోకి వస్తుంది. చివరగా వ్యాధి రివర్సల్ అయ్యే అవకాశాలు ఉంటాయి.



# రాగి పాత్రల్లో నీళ్లు తాగితే ఎంతో ఆరోగ్యం

రాగి పాత్ర... అంటే ఏంటి అని అడిగే వాళ్ళు కూడా ఉంటారు ఈ రోజుల్లో. ఎందుకంటే... ఇపుడంతా ప్లాస్టిక్, గాజు గ్లాసులే ఎక్కువగా వాడుకలో ఉన్నాయి. వీలైతే పేపర్ గ్లాసులు కూడా వాడేస్తున్నారు. కానీ, రాగి పాత్రలో మంచినీళ్ళు తాగితే ఎంత మంచిదో తెలుసా? ఇది బ్యాక్టీరియాను అరికడుతుందని పరిశోధనలో తేలింది. రాబ్ రీడ్ అనే మైక్రో బయాలజిస్ట్ ప్లాస్టిక్, మట్టి, రాగి పాత్రలలో విరోచనాకారి అయిన బాక్టీరియాతో కూడిన నీటిని వాటిలో ఉంచి, 48 గంటల తరువాత ఆ నీటిపై పరిశీలన చేశాడు. రాగి పాత్రలో ఉంచిన నీళ్ళలో బాక్టీరియా శాతం తగ్గింది. అదే ప్లాస్టిక్, మట్టి పాత్రలో ఉన్న బాక్టీరియా శాతం రెండింతలు అయ్యింది.

రాగి పాత్ర వల్ల ఉపయోగాలు:జీర్ణ వ్యవస్థకు మంచిది: రాగి పాత్రలో నీరు తాగడం వల్ల అసిడిటీ, గ్యాస్, అజీర్ణం వంటివి తగ్గడమే కాకుండా, కడుపుకి హాయి కలిగించి, ప్రాణాంతకరమైన బాక్టీరియాను కూడా నిర్మూలిస్తుంది. కిడ్నీ, లివర్ చురుకుగా పనిచేయడంలో తోడ్పడుతుంది.

బరువు తగ్గిస్తుంది: మనం అధిక బరువు తగ్గడానికి రకరకాల పండ్లు, కూరగాయలు వంటివి తింటూ ఉంటాం. కాని వాటివల్ల వచ్చే ప్రయోజనాల కన్నా, వాటికి ఖర్చుపెట్టిన డబ్బు వృథా అయిందన్న దిగులే ఎక్కువ. రాగి పాత్రలో నీరు తాగడం వల్ల అది జీర్ణ వ్యవస్థను సరైన మార్గంలో నడిచేలా చేసి, కొవ్వు మరియు ఇతర చెడు బాక్టీరియాను శరీరం నుండి తీసేస్తుంది.

గాయాలను త్వరగా నయం చేస్తుంది: రాగిలో ఉండే యాంటీ-బాక్టీరియాతత్వం శరీరంలోని అనేక గాయాలను వేగంగా నయం చేయడంతోపాటు రోగనిరోధక వ్యవస్థను మెరుగుపరిచి, శరీరంపై ఉన్న గాయాలనే కాకుండా లోపల ఉన్న గాయాలను, ముఖ్యంగా కడుపులో ఉన్నగాయాలను కూడా తగ్గించడంలో సహాయం చేస్తుంది.

వయసును దాచేస్తుంది: కొంతమంది ఆరోగ్యపరంగా ఎంత చురుకుగా ఉన్నా వారి వయసుకు మించి కనిపిస్తూ ఉంటారు. ఈ సమస్య నుంచి బాధపడేవారు చాలామంది ఉన్నారు. ఇలాంటి వారు రాగి నుండి ఉత్పత్తి అయ్యే ప్రయోజనాలతో వారి సమస్య నుండి విముక్తి లభిస్తుంది. ముఖంపై ఉన్న మచ్చలు, ముడతలు వంటివి రాగి తగ్గిస్తుంది.

క్యాన్సర్ వ్యాధి నుండి పోరాడుతుంది: రాగిలో ఉండే యాంటీ-ఆక్సిడెంట్స్ క్యాన్సర్ వంటి ప్రాణాంతకరమైన రోగాల నుండి కాపాడుతాయి. అమెరికన్ క్యాన్సర్ సొసైటీ వారు చేసిన పరిశోధనాల ప్రకారం రాగి క్యాన్సర్‌ను ఎలా రానివ్వకుండా చేస్తుందో కనుగొనలేకపోయారు. కాని రాగి నిరంతరం క్యాన్సర్ వ్యాపింపజేసే వైరస్‌ను అడ్డుకోవడంలో తోడ్పడుతుందని ఆ పరిశోధనల్లో తేలింది.

మెదడును మెరుగుపరుస్తుంది: మన శరీర భాగంలో అతి ముఖ్యమైన అవయవాల్లో ఒకటి మెదడు. మనిషి శరీరంలో ప్రతీ ఒక్క భాగానికి మెదడుతో సంబంధాలు కలిగి ఉంటాయి. మెదడు నుండి ఆయా భాగాలకు న్యూరాన్ల ద్వారా సంకేతాలు అందుతాయి. ఈ న్యూరాన్లను మ్యెలిన్ తొడుగు కాపాడుతుంది. రాగిలో ఉండే విలువైన పదార్థాలు ఈ మ్యెలిన్ తొడుగును కపాడంతోపాటు, మెదడును చురుకుగా, యవ్వనంగా తయారుచేస్తుంది. ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ వారి ప్రకారం రాగిని రోజుకు 12మి.గ్రా కన్నా ఎక్కువ తీసుకునే అవసరం లేదు అంటే రాగి పాత్రలో కనీసం 8 గంటలు ఉంచిన మంచి నీటిని రోజుకి 3 నుంచి 4 సార్లు తీసుకుంటే సరిపోతుంది. అలాగే రాగి పాత్రని సబ్బుతో కాకుండా సగం కోసిన నిమ్మ చెక్కతో లేదా వంట సోడాతో రుద్ది నీటితో కడిగితే సరిపోతుంది.



# రాత్రి పూట ఎట్టి పరిస్థితిలోనూ ఈ ఆహారాలను అసలు తినకండి..

ప్రస్తుతం ఉరుకుల పరుగుల బిజీ యుగం కారణంగా చాలా మంది అస్తవ్యస్తమైన జీవనశైలిని పాటిస్తున్నారు. ముఖ్యంగా ఆహారం విషయంలో శ్రద్ధ ఉండడం లేదు. ఇష్టం వచ్చిన సమయానికి ఏది పడితే దాన్ని తింటున్నారు. సాయంత్రం అయిందంటే చాలు.. జంక్ ఫుడ్‌ను విపరీతంగా లాగించేస్తున్నారు. ఇక రాత్రి పూట అధికంగా క్యాలరీలు ఉండే ఆహారాన్ని ఆలస్యంగా తింటున్నారు. ఇలా ఆహారం విషయంలో ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తుండడం వల్ల అనేక వ్యాధులు వస్తున్నాయి. ఆహారం విషయంలో జాగ్రత్తలను పాటించకపోవడం వల్ల అధికంగా బరువు పెరుగుతున్నారు. డయాబెటిస్ వస్తోంది. గుండె జబ్బుల బారిన పడుతున్నారు. అయితే రాత్రి పూట కొన్ని రకాల ఆహారాలకు దూరంగా ఉండడం వల్ల ఆరోగ్యానికి కలిగే హాని నుంచి కొంత వరకు అయినా తప్పించుకున్న వారు అవుతారు. రాత్రి సమయంలో కొన్ని ఆహారాలను తినడం మానేస్తే ఆరోగ్యంగా ఉండవచ్చు.

**కారం, మసాలాలు, నూనె పదార్థాలు..:** రాత్రి పూట చాలా మంది కారం, మసాలాలు అధికంగా ఉండే ఆహారాలను తింటుంటారు. ముఖ్యంగా నాన్ వెజ్ కూరలు, బిర్యానీ, పులావ్ వంటి ఆహారాలను తింటుంటారు. అయితే రాత్రి పూట వీటిని తింటే జీర్ణాశయంలో ఆమ్లాలు అధికంగా ఉత్పత్తి అవుతాయి. దీంతో తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం కాక అజీర్తి ఏర్పడుతుంది. కడుపులో మంట, గ్యాస్ వంటి సమస్యలు వస్తాయి. ఇవి నిద్రకు భంగం కలిగిస్తాయి. దీంతో రాత్రి పూట సరిగ్గా నిద్ర ఉండదు. ఇది మళ్లీ ఇతర వ్యాధులకు కారణమవుతుంది. కనుక రాత్రి పూట కారం, మసాలా ఆహారాలను తినడం మానేయాలి. అలాగే పకోడీలు, సమోసాలు, నూనె అధికంగా వేసి తయారు చేసే వేపుళ్లు, నూనె పదార్థాలు, ఇతర జంక్ ఫుడ్‌ను కూడా రాత్రి పూట తినకూడదు. ఇవి జీర్ణక్రియను నెమ్మదింపజేస్తాయి. పొట్టలో గ్యాస్ ఏర్పడేలా చేస్తాయి. దీంతో కడుపు ఉబ్బరం వస్తుంది. రాత్రి పూట నిద్ర కూడా సరిగ్గా పట్టదు.

**కొవ్వులు, ప్రోటీన్లు..:** రాత్రి పూట చాలా మంది రెస్టారెంట్లను తెప్పించుకున్న ఫుడ్‌ను తింటారు. లేదా బయటకు వెళ్లి భోజనం చేస్తుంటారు. ఈ క్రమంలోనే చాలా మంది చికెన్, మటన్, చేపలు, రొయ్యలు వంటి నాన్ వెజ్ ఆహారాలను బయట అధికంగా తింటుంటారు. వీటిని రాత్రి పూట తినడం అంత మంచిది కాదు. ఉదాహరణకు కబాబ్స్, బటర్ చికెన్ వంటి వాటిల్లో కొవ్వులు, ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. ఇవి రాత్రి పూట జీర్ణం అయ్యేందుకు సమయం పడుతుంది. కనుక రాత్రి వీటిని తీసుకోవడం మానేయాలి. అలాగే చక్కెర అధికంగా ఉండే ఆహారాలను లేదా స్వీట్లను రాత్రి పూట తినకూడదు. ఇవి షుగర్ లెవల్స్‌ను విపరీతంగా పెంచుతాయి. దీంతో నిద్రకు ఆటంకం కలుగుతుంది. అలాగే దీర్ఘకాలంగా ఇలా చేస్తే టైప్ 2 డయాబెటిస్ వచ్చే అవకాశాలు పెరుగుతాయి.

**టీ లేదా కాఫీ, ప్రాసెస్డ్ ఫుడ్స్..:** కొందరు రాత్రి పూట భోజనం చేసిన అనంతరం టీ లేదా కాఫీ సేవిస్తుంటారు. ఇలా చేస్తే కెఫీన్ శరీరంలో అధిక మొత్తంలో చేరుతుంది. ఇది నిద్రకు ఆటంకం కలిగిస్తుంది. కనుక రాత్రి పూట టీ, కాఫీలను తాగకూడదు. అయితే అంతగా తాగాలనిపిస్తే హెర్బల్ టీలను సేవించవచ్చు. కమోమిల్ టీని రాత్రి పూట సేవిస్తే మైండ్ రిలాక్స్ అయి నిద్ర చక్కగా పడుతుంది. అదేవిధంగా రాత్రి పూట ప్రాసెస్ చేయబడిన ఆహారాలను కూడా తినకూడూదు. నూడుల్స్, రెడీ టు ఈట్ ఫుడ్స్‌ను రాత్రి తినకూడదు. వీటిల్లో అధికంగా ఉండే సోడియం డీహైడ్రేషన్‌ను కలగజేస్తుంది. దీంతో కిడ్నీలపై భారం పడుతుంది. దీర్ఘకాలంలో కిడ్నీలు చెడిపోయే ప్రమాదం ఉంటుంది. కాబట్టి రాత్రిపూట ఈ ఫుడ్స్‌ను కూడా మానేయాల్సి ఉంటుంది. ఇలా రాత్రి పూట తీసుకునే ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యంగా ఉండవచ్చు. బరువు పెరగకుండా ఉంటారు. గుండె జబ్బులు రాకుండా ఉంటాయి.

# పెరుగులో మేలు చేసే గుణాలు




ఎండాకాలం తరుచుగా ఛాతిలో, కడుపులో మంటపుడుతూ ఉంటుంది. అలాంటప్పుడు చాలామంది కూల్‌డ్రింక్స్ లేదా కూలింగ్ వాటర్ తాగుతారు. వీటికన్నా పెరుగుతో చేసిన లస్సీగానీ, పెరుగు గానీ తింటే సమస్య తగ్గుతుంది. పెరుగులో శరీరానికి మేలు చేసే గుణాలు చాలా ఉన్నాయని ఆహార నిపుణులు చెబుతున్నారు.

ఆహారం తీసుకున్నా కడుపులో మంటగా ఉన్నప్పుడు రోజూ పరగడుపున ఒక కప్పు పెరుగు తింటే చాలా మంచిది. ప్రతిరోజూ పెరుగు తీసుకునే మహిళల్లో వెజైనల్ ఈస్ట్ ఇన్ఫెక్షన్లు వచ్చే చాన్స్ చాలా తక్కువని పరిశోధనలు చెబుతున్నాయి. పెరుగు శరీరంలో తేమ శాతం తగ్గిపోకుండా కాపాడుతుంది. అందుకే జీర్ణవ్యవస్థ పనితీరు బాగుంటుంది. పొట్టలో ఇన్ఫెక్షన్లు రాకుండా ఉంటాయి. హైబీపీ కూడా అదుపులోకి వస్తుంది. పని వల్ల బాగా ఒత్తిడికి గురైనవారు పెరుగు తీసుకుంటే అలసట తీరుతుంది. మంచి నిద్రలోకి వెళ్లి మెదడుపై ఒత్తిడి తగ్గుతుంది. కాబట్టి రోజువారీ ఆహారంలో తప్పనిసరిగా పెరుగు భాగం చేసుకోవాలి. పెరుగులో క్యాల్షియం అధికంగా ఉంటుంది. ఇది ఎముకలకు, దంతాలకు మేలు చేస్తుంది. పెరుగులో ఫాస్ఫరస్ కూడా ఉంటుంది. ఇది క్యాల్షియంతో కలవడం వల్ల ఎముకలు స్ట్రాంగ్‌గా ఉంటాయి. రోజూ పెరుగు తినడం వల్ల భవిష్యత్తులో కీళ్లనొప్పులు, ఆస్టియోపొరోసిస్ లాంటి సమస్యలు రాకుండా ఉంటాయి.

# ఎండల్లో పెరటి మొక్కల సంరక్షణ..

ఎండల్లో పెరటి మొక్కల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వేసవికాలమని కుండీల్లోని మొక్కలకు కొంతమంది అదేపనిగా నీరు పోస్తుంటారు. ఇలా చేస్తే మొక్కల వేర్లు మురిగిపోయే ప్రమాదం ఉంటుంది. కాబట్టి..సూర్యోదయానికి ముందు, సూర్యాస్తమయం తర్వాతే మొక్కలకు నీళ్లు పోయాలి. ఈ సమయమైతేనే.. నీళ్లు నేలలోకి ఇంకిపోవడానికి, వేర్లను చేరుకోవడానికి అనుకూలంగా ఉంటుంది.మొక్కల సంరక్షణలో మొదట చేయాల్సిన పని 'కలుపు'ను ఏరివేయడం.వసంత మాసంలో మొక్కల పెరుగుదల ఎక్కువ. ఈ కాలంలో చీడపీడల బాధ తక్కువ. కాబట్టి, మొక్కలు వేగంగా, ఆరోగ్యంగా పెరుగుతుంటాయి. అయితే మొక్క మరింత ఆరోగ్యకరంగా ఉండా లంటే.. కత్తిరింపులు చేయాలి. క్రాసింగ్, దెబ్బతిన్న కొమ్మలు ఉంటే, వాటిని తొలగించాలి. మొక్కలు బాగా ఎదగాలని ఏ ఎరువులు పడితే అవి పరిమితికి మించి వాడకూడదు. మొక్కలకు సరిపోయేదే ఎన్నుకోవాలి. నత్రజని ఆధారిత ఎరువులు వేసవికి అనుకూలంగా ఉండటంతోపాటు మొక్కల పెరుగుదలనూ ప్రోత్సహిస్తాయి.



# కాజీపేట విష్ణుపురి శ్రీ శివ శక్తి మహంకాళి అమ్మవారి ఆలయంలో... 49వ వార్షిక బోనాల జాతర మహోత్సవాలకు...

## ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేత



ప్రత్యక్ష సాక్షి వరంగల్ ప్రతినిధి

రానున్న ఆగస్టు 9, 2026, కాజీపేట విష్ణుపురి శ్రీ శివ శక్తి మహంకాళి అమ్మవారి ఆలయంలో నిర్వహించనున్న 49వ వార్షిక బోనాల జాతర మహోత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి జాతర మహోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రిక ను అందజేశారు.

ఈ సందర్భం గా ఆలయ కమిటీ సభ్యులు జాతర మహోత్సవాలకు ముఖ్య అతిథిగా విచ్చేసి అమ్మవారి ఆశీస్సులు పొందా లని ఎమ్మెల్యేని ఆహ్వానిం చారు. అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆలయ కమిటీ సభ్యులకు శుభాకాం క్షలు తెలియజేస్తూ, శ్రీ శివ శక్తి మహంకాళి అమ్మ వారి అనుగ్రహంతో బోనాల జాతర మహోత్సవాలు అత్యం త వైభవంగా, భక్తిశ్రద్ధల మధ్య విజయవంతంగా జరగాలని ఆకాంక్షించారు.

# పాఠశాలల ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్..



డి సుధాకర్ ప్రత్యక్ష సాక్షి మెట్‌పల్లి టౌన్

జగిత్యాల జిల్లా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ బుధవారం పాఠశాలల ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు ముందుగా కోరుట్లలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న విద్య మౌలిక వసతులు మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు అనంతరం మోహన్‌రావుపేట జడ్పీ హెచ్ ఎస్పా ఠశాల మధాపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలను సందర్శించి తరగతి గదులు పరిశుభ్రత విద్యార్థుల హాజరు ఉపాధ్యాయుల బోధన విధానంపై ఆరా తీశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మదాపూర్ లో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి నాణ్యతను పరిశీలించారు అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులే దేశ భవిష్యత్తు మీరు బాగా చదివి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధన కోసం కష్టపడాలి తల్లిదండ్రులుహూహూఉపాధ్యాయుల కష్టాన్ని గుర్తించి క్రమశిక్షణతో చదువుకుంటే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకుంటారు..

ప్రతిభను చాటాలని ఏ సమస్య ఉన్నా నిర్భయంగా ఉపాధ్యాయులకు అధికారుల దృష్టికి తీసుకురావాలి అని సూచించారు పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య, నాణ్యమైన భోజనంహూహూఅన్ని మౌలిక సదుపాయాలు అందేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుందని ఎమ్మెల్యే తెలిపారు అధికారులుహూహూఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.

**మెట్ పల్లి మహాలక్ష్మీ అమ్మవారిని దర్శించుకున్న కోరుట్ల ఎమ్మెల్యే డా సంజయ్..** జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని మహాలక్ష్మి అమ్మ వారి మందిరంలో వన భోజనాల సందర్భంగా మెట్ పల్లి మహాలక్ష్మీ అమ్మవారి కి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకొని అమ్మవారిని దర్శించుకున్న కోరుట్ల ఎమ్మెల్యే డా కల్వకుంట్ల సంజయ్ తెలంగాణ మరియు కోరుట్ల నియోజకవర్గం ప్రజలపై తల్లి చల్లని చూపు ఉండాలని కోరుకున్నారు అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు



# మహాలక్ష్మి అమ్మవారికి బోనాలతో నైవేద్యంతో మొక్కులు చెల్లించిన గంగపుత్రులు..



డి సుధాకర్ ప్రత్యక్ష సాక్షి మెట్‌పల్లి టౌన్

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణం గంగాపుత్ర సంఘాల ఆధ్వర్యంలో బుధవారంహూహూమహాలక్ష్మి అమ్మవారికి ఆషాడ బోనాల పండుగ పురస్కరించుకొని పట్టణ గంగ పుత్ర గుల్లెండ్లతో ఊరేగింపుగా ఊరి పోచమ్మ తల్లివారికి చావడి వద్ద భూమాత అమ్మవారికి కొబ్బరికాయ కొట్టి మా లక్ష్మి అమ్మవారికి బోనాలతో బెల్లపు అన్నం తో నైవేద్యంతో మొక్కులు చెల్లించారు అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అమ్మవారికి ఆషాడంలో మొదటి బుధవారం రోజున గొల్లెళ్లతో ఊరేగింపుగా వెళ్లి మహాలక్ష్మిఅమ్మవారికి బోనంతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లిస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో మత్స్య పారిశ్రామిక అధ్యక్షులు పర్రె శంకర్ గంగపుత్ర సంఘ అధ్యక్షులు ఆర్మూర్ నరేందర్ మాన్కాల చిన్నయ్య పర్మి నరసయ్య ఆర్మూర్ రాజేష్ పారుపల్లి శంకర్ పారుపల్లి కిషన్ పారుపల్లి రమేష్ నాగయ్య దీపక్ బొబ్బిలి శ్రీనివాస్ లోకేష్ రవి పోచయ్య ఆర్మూర్ రాజేష్ రాజేశ్వర్ వాల్ గోట్ సాయిలు గంగపుత్ర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా తల్లిపాల వారోత్సవాలు..

గూడ రమేష్, ప్రత్యక్ష సాక్షి, ఇబ్రహీంపట్నం

తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని కోమటి కొండాపూర్ గ్రామంలో గల అంగన్వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి ఉపాధ్యాయులు తల్లిపాల ప్రాముఖ్యతను తెలుపుతూ పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాల లాభాల గురించి మరియు కేవలం ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే తీసుకోవాలని ఆరు నెలల తర్వాత అదనపు ఆహారం గురించి పిల్లల పోషణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొప్పెల్ల పద్మజ వెంకట్, హెచ్ఎం సుధారాణి, ఉపాధ్యాయులు వేణుగోపాల్, విశాల్, రాణి, నర్మద, జోష్న, వివో అధ్యక్షులు జక్కని లక్ష్మి, గుండెల నవ్యశ్రీ, అంగన్వాడీ టీచర్స్ స్వరూప రాణి సుమలత, ఆశాలు పద్మ, వసంత, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.



# ఘనంగా ఆషాఢ మాష బోనాల జాతర..





పల్లె సమ్మయ్య ప్రత్యక్ష సాక్షి మందమర్రి

మందమర్రి పట్టణంలో విద్య నగర్ మేకల మండి ఆధ్వర్యంలో ఆషాడ మాస బోనాల జాతరను బుధవారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన బోనం ఎత్తుకొని శివసతులతో కలిసి ముందుకు నడిచారు. తెలంగాణలో అమ్మవార్లకు బోనాల సమర్పించడం మన ఆనవాయితీ అని మైసమ్మ తల్లి దయవల్ల రాష్ట్ర ప్రజలు, పట్టణ ప్రజలు సింగరేణి కార్మికులు రైతులు అమ్మవారి దీవెనలతో జీవిస్తారని భక్తుల విశ్వాసం అని ఆయన పేర్కొన్నారు. నల్లాల ఓదెలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే ఓదెలు ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు,స్థానిక సీనియర్ కాంగ్రెస్ నాయకులు సోతుకు సుదర్శన్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు శివసత్తులు మహిళా భక్తులు స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీకి అసలైన బలం.. క్షేత్రస్థాయిలో ఉండే కార్యకర్తలే..

## జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామిరెడ్డి



సాయి.. ప్రత్యక్ష సాక్షి వరంగల్ బ్యూరో చీఫ్

కాంగ్రెస్ పార్టీకి అసలైన బలం.. క్షేత్రస్థాయిలో ఉండే కార్యకర్తలే నని, రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కార్యకర్తలు పనిచేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇనుగాల వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. హనుమకొండ లోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బూత్, విలేజ్, మండల స్థాయి కమిటీల నియామక ప్రక్రియ గురించి మండల అధ్యక్షులు, ఇంచా ర్జులతో డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి సమావేశం నిర్వహించారు.

జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షు లు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అధ్యక్షతన జరిగిన,ఈ సమావే శంలో ముఖ్య అతిథిగా టీపీసీసీ జనరల్ సెక్రెటరీ, వరంగల్ పార్లమెంట్ ఇంచార్జి పల్లె శ్రీనివాస్ గౌడ్, టిపిసిసి అధికార ప్రతినిధి, వర్ధన్నపేట ఇంచార్జి కూచన రవళి పాల్గొ న్నారు. మరియు హుస్నాబాద్, స్టేషన్ ఘనపూర్, వర్ధన్నపేట, పరకాల, హుజూరా బాద్, భూపాలపల్లి నియోజక వర్గాల పరిధిలోని వివిధ మండలాల అధ్యక్షులు, డీసీసీ ఇంచార్జ్ కమిటీ సభ్యులు హాజరయ్యా రు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి అసలైన బలం క్షేత్రస్థాయిలో ఉండే కార్యకర్త లేనని..రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేయాలన్నా, మన ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్నా. ఈ కమిటీల నియామకం అత్యంత కీలకమని అన్నారు. అధిష్టానం మనకు ఇచ్చిన గడువు చాలా తక్కువగా ఉన్నందున, మన మందరం పూర్తి బాధ్యతతో పనిచేసి నిర్ణీత గడువులోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది. అన్ని బూత్, విలేజ్ మరియు మండల కమిటీల ఏర్పాటు ప్రక్రియను రాబోయే ఆగస్టు 15వ తేదీ లోపు తప్పకుండా పూర్తి చేయాలని, ఏ మండల కమిటీలోనైనా సరే మొత్తం సభ్యుల సంఖ్య 21 మందికి మించకూడదు. ఇందులో డీసీసీ అధ్యక్షుడి కోటా కింద ప్రతి మండల కమిటీలో కనీసం ఐదుగురు సభ్యులను నామి నేట్ చేసే వెసులుబాటు మరియు ఒక ఉపాధ్యక్షుడిని నియమించే అవకాశం ఉంది కాబట్టి, మండల అధ్యక్షులు ఈ విషయంలో నాతో సమన్వ యం చేసుకోవాలని అన్నా రు. ఈ నియామకాల్లో సామాజి క న్యాయం పాటించడం అత్యంత ముఖ్యమని, ప్రతి కమిటీలోనూ కనీసం 30 శాతం మహిళలకు ఖచ్చితంగా ప్రాతినిధ్యం కల్పించాలని మీనాక్షి నటరాజన్ సూచించా రని, మహిళలు లేని కమిటీల ను అధిష్టానం ఎట్టి పరిస్థితు ల్లోనూ ఆమోదించదని చెప్పా రు.



అలాగే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మరియు మైనారిటీ వర్గాలకు కూడా కమిటీలలో పూర్తి స్థాయి భాగస్వామ్యం కల్పించి, అన్ని వర్గాల కలయికతో కమిటీలను సమతుల్యంగా రూపొందించా లని అన్నారు. కమిటీల నియామకం ముగిసిన వెంటనే, ఆగస్టు 15 నుండి ఆగస్టు 31 మధ్యలోనే ఆయా మండలాల్లో తొలి అధికారిక మండల కమిటీ సమావేశాన్ని కూడా విజయవంతంగా నిర్వహించాలని సూచించారు, కమిటీల నియామకం ప్రక్రియలో మండల అధ్యక్షులు మరియు ఇంచార్జ్ కమిటీ సభ్యులు మీయొక్క నియోజ కవర్గ ఎమ్మెల్యేల సూచనలు తీసుకొని ఒకరితో ఒకరు సమన్వయం చేసు కుంటూ, ఎలాంటి వివాదాలకు తావులేకుండా అర్హులైన, కష్టపడే నాయకులకు కమిటీల్లో చోటు కల్పించాలని కోరుతున్నాను. ఏఐసీసీ ఆదేశాల ప్రమాణాలు పాటించని కమిటీలకు డీసీసీ అధ్యక్షుడిగా నేను ఆమోదం తెలపడం సాధ్యం కాదని నొక్కి చెప్పారు.

# ఈనెల 10న జరిగే జైలు భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయండి..సిఐటియు నేత బొట్ల చక్రపాణి



సాయి.... ప్రత్యక్ష సాక్షి వరంగల్ బ్యూరో చీఫ్

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక రైతు వ్యవసాయ కూలీలకు నష్టం చేసే విధానాల నిరసిస్తూ ఈనెల 10న జరిగే దేశవ్యాప్త జైలు భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కోశాధికారి బొట్ల చక్రపాణి కార్మికులకు రైతు వ్యవసాయ కూలీలకు పిలుపునిచ్చారు ఈరోజు పరకాల పట్టణంలో కార్మికుల లో కరపత్రంతో విస్తృ త ప్రచారం నిర్వహించారు

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లను తీసుకొచ్చి కార్మికులను యజమానులకు కట్టు బానిసలు లాగా మారుస్తు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ చట్టాన్ని ని రద్దుచేసి విబిజి రాంజీ పథకం ద్వారా ఉపాధి కూలీల పొట్టన కొడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు రైతులకు నష్టం చేసే విధంగా ఇతర దేశాల నుండి వ్యవసాయ ఉత్పత్తులు దిగుమ చేసుకోవడం ద్వారా ఇక్కడ ఉన్న రైతులు నష్టపోయే అవకాశం ఉందని అలాగే విద్యుత్ సంస్కరణ బిల్లు విత్తన చట్టం మూలంగా రైతంగం తీవ్రంగా నష్టపోతుం దని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

సంపద సృష్టికర్తలైన కార్మిక వ్యవసాయ కూలీలు రైతులకు నష్టం చేసే విధానాలను తిప్పి కొట్టడం కోసం జరుగుతున్న జైలువరో కార్యక్రమంలో సకల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు బొచ్చు ఆదాం కృష్ణంరాజు సాంబయ్య కమల్ రాజు మోహన్ రమేష్ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

# రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో బోనాల జాతర





పల్లె సమ్మయ్య ప్రత్యక్ష సాక్షి మందమర్రి

మందమర్రి పట్టణంలో 1979 నుండి రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో 165 కుటుంబాలు ప్రతి ఏటా నిర్వహించే బోనాల జాతర బుధవారం మందమర్రి మార్కెట్ లోని రాజుల రామ్ చందర్ ఇంటి నుండి మొదలై మహిళలందరూ బోనం ఎత్తుకుని మార్కెట్ పుర వీధుల గుండా స్టేషన్ రోడ్ లోని పోచమ్మ ఆలయాన్ని దర్శించుకున్నారు. 3 వ జూన్ లోని నల్ల పోచమ్మ దగ్గరికి రజక సంఘంలోని కుటుంబ సభ్యులందరూ కలిసి కేకే పై ఫిల్టర్ బెడ్ దగ్గరనూతనంగాప్రతిష్ఠించుకున్న మడేలేశ్వర స్వామి ఆలయాన్ని వందలాది బోనాలతో జాతర నిర్వహించారు.

అనంతరం కుల దైవమైన మడేలయ్య ఆలయం చుట్టూ ప్రదక్షనలు చేసి బోనాలు సమర్పించి మొక్కలుచెల్లించుకున్నారు. బాజా భజంత్రీలు డీజే పాటల మోతలతో నృత్య ప్రదర్శనగా ఈ జాతర కన్నుల పండుగ కొనసాగింది. ఆద్యంతం భక్తి భావంతో బోనాల జాతర సాగింది. అధ్యక్షుడు గంగరాజుల రామ్ చందర్ మాట్లాడుతూ మన సంస్కృతికి,కుల వృత్తుల ఆత్మగౌరవానికి బోనాల జాతర ప్రతీకని మన కులదైవమైన మడేలేశ్వర స్వామి ఆశీస్సులు,గ్రామ దేవతల కరుణా కటాక్షాలు ఉంటే రజక కుటుంబాలన్నీ చల్లగా వర్ధిల్లుతాయని, రజక వృత్తిదారులందరూ సంఘటితంగా ఉండి మన సంప్రదాయాలను, భక్తి భావాన్ని భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. పట్టంలోని కుల సంఘాలని సహకారం అందిస్తే మున్ముందు జాతర ఏర్పాట్లు మరింత ఘనంగా నిర్వహిస్తామని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంగేపు హనుమంతు ప్రధాన కార్యదర్శి రాగుల రాములు, క్యాషియర్ మామిడి రమేష్, చల్లా బద్రి, గుడికందుల సమ్మయ్య సభ్యులు పెనుగొండ సమ్మయ్య కళావతి తిరుపతి పైతర్ శ్రీను, గుడి ఓదెలు, గొడ్డుపెల్లి సారయ్య, బుక్కెర అంజి, కొత్తకొండ రమేష్, తదితరులు, పాల్గొన్నారు.

printed,published and owned by Kandukuri Parameshwar Rao, printed at Rimsha printers,. H .no 5-16/1, Algunoor,Mandal Thimmapur, Dist Karimnagar (TS) place of Publication H.NO.1-2-31/4/B/1 krishna nagar jagital dist(TS).cell no.99892 88546, Editor K.Parameshwar rao. RNI No.APTEL/2011/38267. kprao1961@gmail.com